ప్రభోదన్‌కార్ కేశవ్ సీతారాం ఠాకరే ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి, అసమాన ప్రతిభావంతుడు. ఆయన జీవితం, అనుభవాలు కేవలం జ్ఞాపకం ఉంచుకోదగినవే కాకుండా భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయి, శక్తిని ప్రసాదిస్తున్నాయి.

సత్యశోధన ఆందోళన ద్వారా గుర్తింపు పొందినప్పటికీ ఆయన ప్రతిభ కళ, నాటక, సినిమా, సాహితీ, సామాజిక రంగాలకు విస్తరించింది. ఆలోచనపరునిగా, నేతగా, రచయితగా, పత్రికా విలేకరిగా, సంపాదకునిగా, వక్తగా, ధర్మ-సమాజ సుధారకునిగా, ప్రకాశకునిగా, చరిత్రకారుడుగా, నాటక-సినీ రచయితగా, నటునిగా, సంగీత నిష్ణాతునిగా, ఉపాధ్యాయునిగా, చిత్రకారునిగా, ఛాయాచిత్రకారునిగా, టైపిస్టుగా ఆయా రంగాల్లో ప్రావీణ్యం పొందిన నిగర్వి ఆయన. ఎత్తు పెరగకుండా, మర్రిచెట్టుగా విస్తరించి పది మందితో సమానమైన జీవితాన్ని ఆస్వాదించిన కర్మయోగి.

మహారాష్ట్ర దిశ, దశ, చారిత్రక, భౌగోళిక మార్పులకు కారకులైనవారిలో ప్రభోదన్‌కార్ ప్రథమ వరుసలో నిలిచారు. అన్యాయానికి వ్యతిరేకంగా ఆయన రాజీలేని పోరాటం చేశారు. సత్యశోధన ఉద్యమాన్ని రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో సైతం రగలించారు. ఈ విషయంలో ఆయన కలిగించిన చైతన్యం మహారాష్ట్రను ఇరవయ్యో శతాబ్దంలోకి సమర్ధవంతంగా నడిపించింది. స్థిరమైన అభిప్రాయంతో, నిర్దిష్టమైన ఆలోచనా సరళితో ఆయన్ని చూడకూడదు. నాణేనికి బొమ్మాబొరుసు మాదిరిగా బహుజన, హిందుత్వవాదిగా మనగలగడం ఆయనకే సాధ్యమైంది. ప్రబోధాన్‌కార్‌గా ఆయన్ని ఇష్టపడేవారికి ఆయన ఇంటి పేరైన ఠాకరే నచ్చలేదు, ఠాకరేగా ప్రేమించేవాళ్ళకు ఆయన ప్రబోధాన్‌కార్‌గా ఉండిపోవడం నచ్చలేదు. ఫలితంగా ఆయన తెరవెనుకే ఉండిపోయారు.

లోఖిత్‌వాడి, అగార్కర్ మరియు మహాత్మా పూలేల విప్లవ సాహిత్యం సంస్కరణవాదిగా అతనికి సిద్ధాంతపరమైన పునాది వేశాయి. ఆయన ఎప్పుడూ సిద్ధాంతాల విషయంలో రాజీపడలేదు. దేవాలయాల్లో బ్రాహ్మణుల నిరంకుశత్వం, వితంతువులకు శిరోముండనం, అంటరానితనం లాంటి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈ దురాచారాలకు ప్రధాన కారణం భిక్షుసాహియేనని ఆయన గట్టిగా విశ్వసించారు. దీనివల్ల మహిళలు మరియు ఎక్కువ మంది పేద ప్రజలు బాధితులుగా మిగులుతుండటంతో భిక్షుసాహికి వ్యతిరేకంగా పోరాడారు. ముంబయి నగరంలో స్థిరపడ్డాక వరకట్న వ్యతిరేక ఉద్యమం సాగించారు. స్వాధ్యాయ్ ఆశ్రమం మరియు ప్రభోదన్ మ్యాగజైన్ ఈ ఉద్యమానికి బాసటగా నిలిచాయి.

ఠాకరే మంచి రచయిత కూడా. ఆయన చేతి నుంచి జాలువారిన 'టక్లేలే పోర్' (వదిలేయబడిన బిడ్డ) మరియు  'ఖడా బ్రాహ్మణ్' (అసలైన బ్రాహ్మణుడు) నాటికలు చరిత్ర సృష్టించాయి. 1885 సెప్టెంబరు 17న పన్వేల్‌లో జన్మించిన ఠాకరే స్వస్థలం పాలి కాగా, సంయుక్త మహారాష్ట్ర ఆయన జీవితంలోకెల్లా అత్యంత ముఖ్యమైన ఉద్యమం.